

బరిలో దిగితే మెడల్ ఖాయం

బాస్కెట్‌బాల్ క్రీడలో ధర్మవరం క్రీడాకారులు రాణిస్తున్నారు. బరిలో దిగితే తమ అద్భుత ఆట తీరుతో మెడల్ సాధించుకుని వస్తున్నారు. 8లో



టమాట కిలో రూ.25

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.25 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.15 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.8°/23.2°

జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఆర్టీసీ బస్సు బోల్తా

- 13 మందికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం



ప్రమాదానికి గురైన బస్సు

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన లోతట్టు ప్రాంతంలో బోల్తాపడింది. ఆదివారం బెంగళూరు నుంచి పుట్టపర్తికి బయల్దేరిన పుట్టపర్తి డిపో ఆర్టీసీ బస్సు మధ్యాహ్నం మూడు గంటల సమయంలో కర్ణాటక రాష్ట్రం గుడిబండ మండల పరిధిలోకి చేరుకుంది. డ్రైవర్ స్టీరింగ్‌పై అదుపుతప్పడంతో బస్సు క్షణాల్లో ఎడమవైపు లోతట్టు ప్రాంతంలోకి దూసుకెళ్లి రెండు పల్టీలు కొట్టి తర్వాత నిలబడింది. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. ఇందులో మొత్తం 13 మంది గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో చిక్ బళ్ళాపూర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మిగిలిన వారిని బాగేపల్లి ప్రభుత్వాస్పత్రికి చేర్చారు. పరిస్థితి విషమంగా ఉన్న వారిలో డ్రైవర్ కూడా ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు. ఆర్టీసీ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి.. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు.

యల్లనూరులో కీచక టీచర్

- కాంట్రాక్ట్ ఉపాధ్యాయుడు భాస్కర్‌నాయక్ వికృత చేష్టలు
- తాత్కాలికంగా కీచకుడిని తప్పించిన మోడల్ స్కూల్ ఏడీ
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన



భాస్కర్‌నాయక్

యల్లనూరు: తల్లిదండ్రులు తమ పిల్లలను ఎన్నో ఆశలతో పాఠశాలలకు పంపుతుంటారు. అలాంటి పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన ఓ టీచర్ కట్టుతప్పాడు. అభం శుభం తెలియని విద్యార్థినులను వేధిస్తూ పైశాచికానందం పొందాడు. ఆలస్యంగా వెలుగుచూసిన ఘటనకు సంబంధించిన వివరాలిలా.. మండలంలోని చిలమకూరు మోడల్ స్కూల్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో కంప్యూటర్ ఉపాధ్యాయుడిగా భాస్కర్‌నాయక్ పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా ఇతను 8వ తరగతి విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. తాకకూడని చోట తాకుతూ వికృతానందం పొందుతున్నాడు. ఈ క్రమంలో విషయాన్ని పిల్లలు తమ తల్లిదండ్రులకు తెలియజేశారు. ఆగ్రహం చెందిన వారు.. వారం క్రితం పాఠశాలకు చేరుకుని ఎంఈఓ చంద్రశేఖర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మహేష్‌ను నిలదీశారు. అయితే, విషయం బయటకు తెలియకుండా తల్లిదండ్రులకు వారు నచ్చజెప్పారు. స్థానిక అధికారుల ఫిర్యాదు మేరకు భాస్కర్‌నాయక్‌పై డీఈఓ వరలక్ష్మి, మోడల్ స్కూల్ ఏడీ నాగరాజు క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఇక నుంచి విధులకు రావొద్దని ఆదేశించారు. వేరే చోటుకు బదిలీ చేసుకోవాలని తెలియజేసినట్లు సమాచారం. అయితే, భాస్కర్‌నాయక్‌ను విధుల నుంచి తొలగించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై ప్రిన్సిపాల్ మహేష్‌ను సంప్రదించగా, వారం రోజుల క్రితం ఘటన జరిగినట్లు తెలిపారు. అప్పటి నుంచి భాస్కర్ నాయక్‌ను విధులకు రానివ్వలేదని చెప్పారు.

కరువు మేఘం

గోరంట్ల మండలం బూడిదగడ్డపల్లికి చెందిన ఒక రైతు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాధారపు పంటగా తనకున్న నాలుగెకరాల పొలంలో వేరుశనగ సాగు చేయాలనుకున్నాడు. జూలై మొదటి వారంలో విత్తనకాయలు సిద్ధం చేసుకున్నాడు. అప్పటి నుంచి ఇప్పటి దాకా తగిన వర్షం కురవకపోవడంతో రోజూ ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తూ ఉండిపోయాడు. ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగుకు అదను దాటిపోయిందని నాలుగు రోజుల క్రితం వ్యవసాయాధికారి చెప్పడంతో చేసేది లేక ఆ రైతు విత్తనం అమ్ముకోక తప్పలేదు. ఇలాంటి రైతులు జిల్లా వ్యాప్తంగా చాలామంది ఉన్నారు. అలాగే సాగుచేసిన రైతులు కూడా సరైన వర్షం లేక పంట ఎండిపోతోందని ఆవేదన చెందుతున్నారు.



నల్లచెరువు వద్ద బీడుగా ఉన్న భూమి

- ఆకాశం వైపు ఆశగా రైతుల ఎదురుచూపు
- వేరుశనగ సాగుకు సమయం దాటిందన్న శాస్త్రవేత్తలు
- జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 2,89,501 హెక్టార్లు
- సాగు చేసింది 34 శాతం మాత్రమే

కదిరి: వరుణుడు ముఖం చాటేశాడు. వర్షాభావం కారణంగా ఈ యేడాది ఖరీఫ్‌లో అంతో ఇంతో సాగు చేసిన వేరుశనగతో పాటు ఇతర పంటలు కూడా ఎండుముఖం పట్టాయి. ఈసారి సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల పంటల సాధారణ సాగు విస్తీర్ణం 2.89 లక్షల హెక్టార్లు కాగా.. అందులో ఇప్పటిదాకా 99 వేల హెక్టార్లలో (34.52 శాతం) మాత్రమే సాగు చేశారు. ఇంకా 1.89 లక్షల హెక్టార్లు సాగు చేయాల్సి ఉంది. ఈ సీజన్‌లో ప్రధానంగా సాగు చేసే వేరుశనగ కూడా చాలా తక్కువ విస్తీర్ణంలో సాగైంది. సాధారణ సాగు విస్తీర్ణం 1.74 లక్షల హెక్టార్లు కాగా.. అందులో 65 వేల హెక్టార్లు (37.86 శాతం)మాత్రమే సాగు చేశారు. కమ్ముకున్న కరువు మేఘాన్ని చూస్తే కరువు వచ్చినట్లేనని రైతులు ఆవేదన చెందుతున్నారు. జూలైలో 63 మి.మీకు గాను కేవలం 24.4 మి.మీ మాత్రమే వర్షపాతం నమోదైంది. ఆ నెలలో మూడు రోజులు మాత్రమే అరకొర వర్షం కురిసింది. పంట సాగుకు ఇది ఏమాత్రమూ సరిపోదు. ఆగస్టు మొదలైనప్పటి నుంచి వర్షాలు కురుస్తున్నా ప్రధాన పంటల సాగుకు ఉపయోగపడలేదు.

వేరుశనగకు ముగిసిన అదను

వేరుశనగ సాగు చేసేందుకు అదను దాటిపోయిందని వ్యవసాయాధికారులతో పాటు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఖరీఫ్‌లో ప్రధాన పంట అయిన వేరుశనగ సాగుకు జూలై 10–20 తేదీల మధ్య మంచి అదను అని వారంటున్నారు. ఆ తర్వాత సాగు చేస్తే ఆశించిన దిగుబడులు రావని వారు చెబుతున్నారు.

ప్రత్యామ్నాయ పంటలే ముద్దు

వేరుశనగ సాగుకు సమయం దాటిపోయినందున ఇప్పుడు వర్షాలకు ప్రత్యామ్నాయం కింద పెసలు, ఉలవ, అలసంద, జొన్న సాగుచేస్తే మంచి దిగుబడులు ఆశించవచ్చని అధికారులు, శాస్త్రవేత్తలు అంటున్నారు. వీటి సాగుకు ఖర్చు కూడా తక్కువేనని, అలాగే పంట కాలపరిమితి కూడా తక్కువేనని పేర్కొంటున్నారు.

ప్రభుత్వానికి ముందు చూపు ఏదీ?

గత ప్రభుత్వం వేరుశనగ సాగుకు సమయం దాటిపోతే ప్రత్యామ్నాయ పంటల సాగు విషయంలో రైతులకు అండగా నిలిచింది. అప్పట్లో జిల్లా వ్యాప్తంగా వీటి సాగుకోసం 25 వేల క్వింటాళ్ల పెసలు, ఉలవ, అలసంద, జొన్న లాంటి చిరుధాన్యాలను ఆర్‌బీకేల్లో ముందే సిద్ధం చేసింది. అవి కూడా 80 శాతం సబ్సిడీతో రైతులకు అందజేసింది. కానీ కూటమి ప్రభుత్వం ఇప్పటి దాకా ప్రత్యామ్నాయంపై ఎలాంటి ప్రయత్నాలూ చేయలేదు.

జిల్లాలో ఖరీఫ్ సాగు వివరాలు

పంట	సాధారణ విస్తీర్ణం (హెక్టార్లలో)	సాగు చేసినది (హెక్టార్లలో)	సాగు శాతం
వరి	5031	664	13.20
జొన్న	1418	154	10.86
సజ్జ	904	366	40.49
మొక్కజొన్న	15221	6985	45.85
రాగి	2528	901	35.64
కొర్ర	667	39	5.85
కంది	26,528	15055	56.75
పెసర	1046	19	1.82
ఉలవ	9193	78	0.85
వేరుశనగ	1,74,910	65,004	37.16
సన్‌ఫ్లవర్	682	6	0.88
ఆముదం	3230	1557	48.20
పత్తి	2339	1821	77.85
ఇతర పంటలు	42119	6961	16.53
మొత్తం	2,89,601	99,969	34.52

మళ్లీ కరువు వచ్చింది



ఖరీఫ్ సీజన్ దాటిపోతున్నా మంచి వర్షం కురవలేదు. రైతులంతా ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. పరిస్థితి చూస్తుంటే ఈసారి కరువు ఛాయలే కనబడుతున్నాయి. ప్రభుత్వం రైతులను ఆదుకోకపోతే కష్టమే. రైతుభరోసా డబ్బులు కూడా ఇంత వరకూ రైతుల ఖాతాల్లో జమ చేయలేదు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలన్నా ప్రభుత్వం నుంచి సహకారం లేదు.

– కోటేశ్వరరెడ్డి, రైతు, ముదిగుబ్బ

ఇప్పట్లో వేరుశనగ వద్దు



ఆగస్టు తొలి వారం వరకూ వేరుశనగ సాగుకు సమయం ఉండేది. ఇక అదను దాటిపోయింది. ఇక వేరుశనగ సాగు చేయకపోవడం మంచిది. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకుంటే కొంత మేరకు లాభాలు ఆశించవచ్చు. ఇప్పుడు వర్షం పడితే పెసలు, ఉలవ, అలసంద, జొన్న వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవచ్చు.

–డా.వై.వి.సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

ఉద్యోగులతో మాట్లాడాకే మార్పులు తేవాలి

- సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ

అనంతపురం సిటీ: గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగ సంఘం నాయకులతో సమావేశం నిర్వహించి క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను, ఉద్యోగుల అభిప్రాయాలను తెలుసుకున్నాకే ఏవైనా మార్పులు చేపట్టాలని గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వి. లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఏపీజీఈఏ జిల్లా కార్యాలయంలో ఆదివారం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల విన్నపాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములవుతామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాధ్యక్షుడు శివశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమంతు, జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహ, మహేష్, రామాంజినేయులు, జిల్లా సహాయ కార్యదర్శులు హనుమంతు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలే ఎంచుకోవాలి

- ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి



మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త మల్లేశ్వరి

బుక్కరాయసముద్రం: రైతులు నాణ్యమైన విత్తనాలే ఎంచుకోవాలని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి అన్నారు. ఢిల్లీలో ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ 109 రకాల విత్తన వంగడాలను విడుదల చేసే కార్యక్రమాన్ని పురస్కరించుకుని రెడ్డిపల్లి కేవీకేలో రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి మాట్లాడుతూ ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి రెండు రకాలను ప్రధాని మోదీ విడుదల చేశారన్నారు. పప్పుశనగలో ఎన్‌బీఈజీ-1267, పెసరలో ఎల్‌జీజీ-610 రకాలు జిల్లా నేలలకు ఎంతో అనువైనవన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ కిషోర్, ముత్యాల రావు, తదితరులు పాల్గొన్నారు.

పుడా పీఠం ఎవరిదో?



- టీడీపీ నేతల పైరవీలు షురూ
- ముఖ్యనేతల చుట్టూ ప్రదక్షిణ

పుట్టపర్తి: నామినేటెడ్ పదవుల కోసం ఔత్సాహికులు పైరవీలు సాగిస్తున్నారు. జిల్లాలో పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పుడా) చైర్మన్ పీఠం కోసం అధికార టీడీపీలో పలువురు నాయకులు తీవ్రస్థాయిలో ప్రయత్నిస్తున్నారు. తమకంటే తమకు ఇవ్వాలని అధిష్టానంపై ఒత్తిడి పెంచుతున్నారు. గత పది రోజులుగా ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిలతో పాటు అమరావతి, విజయవాడలో పార్టీ ముఖ్య నేతల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. టీడీపీ–బీజేపీ–జనసేన కూటమి సర్కారులోను, టీడీపీలోను కీలకంగా వ్యవహరిస్తున్న మంత్రి నారా లోకేష్‌ను కలిసి తమకు అవకాశం కల్పించాలంటూ విన్నవించుకుంటున్నారు.

రేసులో ఉన్నది వీరే..

అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా పార్టీ కోసం 30 ఏళ్లుగా చిత్తశుద్ధితో పనిచేసిన తనకు పుడా చైర్మన్ పదవి ఇవ్వాలని పుట్టపర్తి పట్టణ కన్వీనర్, బీసీ నేత బ్రాహ్మణపల్లికి చెందిన రామాంజనేయులు ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి వద్ద పట్టుపడుతున్నారు. గతంలో ఎంపీపీగా పని చేశానని, పార్టీ క్లిష్ట పరిస్థితుల్లోనూ వెన్నంటి ఉన్నానని అధిష్టానానికి వివరించినట్లు తెలుస్తోంది.

- జిల్లా కేంద్రం పుట్టపర్తిలో తమకు మంచి పట్టు ఉందని, గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి అధిక మెజారిటీ తీసుకురావడంలో కీలకంగా వ్యవహరించామని, పుడా చైర్మన్‌గా అవకాశం కల్పించాలని వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరిన రామ్–లక్ష్మణ్ సోదరులు ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిలతో పాటు లోకేశ్‌కు బయోడేటా సమర్పించినట్లు తెలుస్తోంది.
- లోకేశ్ యువగళం పాదయాత్ర సమయంలో తాను అన్ని జిల్లాల్లోనూ పాల్గొన్నానని, పుట్టపర్తి ఎమ్మెల్యేగా పల్లె సింధూర గెలవడంలో తన పాత్ర ఉందని వివరిస్తూ కమ్మవారిపల్లికి చెందిన ఊరు వాకిలి సురేష్‌నాయకుడు పుడా చైర్మన్ పీఠం కోసం గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.
- వీరు కాక మున్సిపల్ టీడీపీ ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి పార్టీ అధిష్టానంతో తనకున్న పలుకుబడిని ఉపయోగించుకుని చైర్మన్ స్థానం కోసం తీవ్ర స్థాయిలో ప్రయత్నిస్తున్నారు.
- ఇక రెడ్డి సామాజికవర్గం నుంచి శ్రీరామిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, తలమర్ల మారుతీరెడ్డి పుడా చైర్మన్ రేసులో ఉన్నారు. తనకు చైర్మన్ పదవి ఇవ్వాలని మారుతీరెడ్డి పార్టీ పెద్దల వద్ద గట్టిగా కోరినట్లు తెలిసింది.

ఇదిలా ఉండగా

- టీడీపీ పట్టణ కన్వీనర్ రామాంజనేయులుకు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆశీస్సులు ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. రామ్‌లక్ష్మణ్, సురేష్ నాయుడులకు మంత్రి నారా లోకేశ్ ఆశీస్సులు ఉన్నట్లు చెబుతున్నారు.

బీజేపీ, జనసేన నేతలు సైతం...

పుడా చైర్మన్ పదవి కోసం టీడీపీతో పాటు కూటమిలో భాగస్వామ్య పక్షాలైన బీజేపీ, జనసేన నాయకులు కూడా పోటీపడుతున్నారు. వీరే కాక మరికొంతమంది కొత్తవ్యక్తులు నామినేటెడ్ పోస్టుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

ఏలూరు భక్తుల కళా వైభవం



రామ కథ-సాయి సుధ నృత్యరూపకం



సత్యసాయి అష్టోత్తర నామావళి పఠనం



సాయి భక్తుల సాంస్కృతిక ప్రదర్శన

ప్రశాంతి నిలయం: శ్రీరామ చరితను వివరిస్తూ ఏలూరు జిల్లా సత్యసాయి భక్తులు ఆధ్యాత్మిక సాంస్కృతిక కళావైభవాన్ని చాటారు. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన భక్తులు రెండో రోజు సత్యసాయి సన్నిధిలో పలు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత సత్యసాయి అష్టోత్తర నామావళి పఠించారు. సాయంత్రం రామాయణ ఘట్టాన్ని కళ్లకు కట్టారు. సత్యసాయి రచించిన రామ కథ రస వాహిని ఆధారంగా 'రామ కథ–సాయి సుధ' పేరుతో బాలవికాస్ చిన్నారులు చక్కటి వేషధారణతో అకట్టుకునే భంగిమలతో నృత్య రూపకం ప్రదర్శించారు.

కొట్టుకుపోతున్న ఆశలు

తుంగభద్ర జలాశయంపై ఇప్పటి వరకూ ఎంతో ఆశతో ఉన్న రైతులపై ఒక్కసారిగా పిడుగుపడింది. డ్యాంలోని ఓ క్రస్ట్ గేట్ కొట్టుకుపోయిందనే వార్తతో ఆందోళన మొదలైంది. ఆయకట్టులో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది.

- టీబీ డ్యాంలో తెగిపోయిన క్రస్ట్ గేట్
- వృథాగా పోతున్న నీరు
- డ్యాంలో సగం నీరు ఖాళీ అయితేనే మరమ్మతులకు ఆస్కారం!
- పిడుగులాంటి వార్తతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన



తుంగభద్ర జలాశయం నుంచి దిగువకు వృథాగా పోతున్న నీరు

బొమ్మనహాళ్/రాయదుర్గం: అంతా సాఫీగా సాగిపోతోందనుకుంటున్న తరుణంలో ఊహించని పరిణామం ఎదురైంది. అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ జిల్లాలకు జీవనాడిగా పేరుగాంచిన తుంగభద్ర డ్యాంకు ఉన్న 33 క్రస్ట్ గేట్లలో 19వ నంబర్ గేటు చైన్ తెగిపోయి కొట్టుకుపోయింది. ఈ హఠాత్పరిణామంతో ఆయకట్టు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిపోయింది. అన్నదాతలు తీవ్ర ఆందోళనలో కూరుకుపోయారు.

ఆశలు రేపి.. ఆవిరి చేసి..

గత ఏడాది వర్షాభావ పరిస్థితులతో టీబీ డ్యాంకు అనుకున్న స్థాయిలో నీరు రాలేదు. దీంతో తుంగ భద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కు కోటా మేరకు నీరు విడుదల చేయలేదు. ఆయకట్టు కింద పంట పండించుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడ్డారు. అయితే, ఈ ఏడాది మాత్రం వర్షాలతో తుంగభద్ర ఉగ్రరూపం దాల్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా జలాశయానికి వరదనీరు వచ్చి చేరింది. దీంతో 32 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. హెచ్చెల్సీకి కూడా నీటి విడుదల ప్రారంభించడంతో కోటి ఆశలతో ఆయకట్టు భూముల్లో రైతన్నలు ముందస్తు సాగుకు సమాయత్తమయ్యారు. కొందరు పెంటమళ్లు సిద్ధం చేస్తుండగా, బోర్ల కింద ముందే వరి నార్లు పెంచుకున్న రైతులు నాట్లు వేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. హెచ్చెల్సీకి కేటాయించిన 26.36 టీఎంసీల నికర జలాలను కచ్చితంగా తీసుకొచ్చేలా అధికారులు కూడా చర్యలు చేపడుతున్న నేపథ్యంలో గేటు కొట్టుకుపోయిందన్న వార్త తెలిసి ఒక్కసారిగా వారు హతాశయులయ్యారు.

అశనిపాతమేనా..?

కొట్టుకుపోయిన గేటు స్థానంలో కొత్తది ఏర్పాటు చేసేందుకు అధికారులు రంగంలోకి దిగారు. అయితే, డ్యామ్‌లో కేవలం 45 టీఎంసీల నీరు ఉంటేనే కొత్తగా గేటును అమర్చడానికి వీలు కలుగుతుందని తేల్చారు. ఈ క్రమంలో ప్రస్తుతం డ్యాంలో ఉన్న 104 టీఎంసీల నీటిలో దాదాపు సగం వృథాగా వదిలివేయాల్సి ఉంటుంది. గేటు ఏర్పాటు పూర్తయిన తర్వాత ఇన్‌ఫ్లో భారీగా కొనసాగితేనే మళ్లీ డ్యాం నిండే అవకాశం ఉంటుంది. అయితే, కొన్ని రోజులుగా డ్యాంకు ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గిపోతున్న నేపథ్యంలో జలాశయం నిండుతుందా, ఆయకట్టుకు నీరు అందుతుందా అన్నదానిపై నీలినీడలు కమ్ముకున్నాయి.

రెండు మూడు రోజుల తర్వాతే మరమ్మతులు

తుంగభద్ర జలాశయం 19వ క్రస్ట్ గేట్ నీటి ఉధృతికి విరిగిపోయి కొట్టుకుపోయింది. గేటు మరమ్మతులు ప్రారంభించేందుకు బోర్డు అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటున్నాం. డ్యాం పూర్తి స్థాయిలో నిండడంతో మరమ్మతులు చేపట్టేందుకు వీలు లేదు. రెండు, మూడు రోజుల పాటు నీటిని నదికి వదిలి మరమ్మతు పనులు చేపడతాం. ఆయకట్టు రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ నెలాఖరు, సెప్టెంబర్‌లో డ్యాం ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

– రాజశేఖర్, హెచ్చెల్సీ ఎస్‌ఈ

గురువే ప్రత్యక్ష దైవం



గురువులతో సమావేశమైన పూర్వ విద్యార్థులు

పుట్టపర్తి: గురువు ప్రత్యక్ష దైవమని పూర్వవిద్యార్థులు పేర్కొన్నారు. బుక్కపట్నం ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) కళాశాలలో 2004-06 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం స్థానిక ఆడిటోరియంలో నిర్వహించారు. ఇక్కడ చదివిన వారిలో ఎక్కువ మంది ఉపాధ్యాయులుగా సేవలందిస్తున్నవారే. అప్పటి గురువులైన శివారెడ్డి, సాయిప్రసాద్, శంకర్‌రెడ్డి, సుబ్బరాయుడు, వెంకటరమణ, లక్ష్మీ,విజయకుమారి, హనుమంతప్ప తదితరులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నాటి ఛాత్రోపాధ్యాయులలో ఎక్కువమంది టీచర్లుగా పనిచేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్‌గా షమ్మీ, ఏసీటీఓలుగా రమేష్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా డైట్ కళాశాల వ్యాయామ అధ్యాపకులు రామకృష్ణను ఘనంగా సత్కరించారు. శ్రీనివాసులు, రాంబాబు, రమేశ్‌రెడ్డి, శ్రీలక్ష్మి, దుర్గాదేవి, రామకృష్ణ, నాగమణి, భవ్య, ఓబిలేసు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి

తాడిమర్రి: మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బీసాని మారుతిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత అల్లు చలపతి దాడి చేశాడు. బాధితుడు తెలిపిన మేరకు... దళిత సామాజికి వర్గానికి చెందిన బీసాని మారుతి ఏడాది క్రితం అల్లు చలపతి వద్ద రూ.30 వేలు అప్పు చేశాడు. కొంత కాలంగా తన బాకీ తీర్చాలంటూ చలపతి ఒత్తిడి తెచ్చాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి మారుతిని తన ఇంటి వద్దకు పిలిపించుకుని అప్పు కట్టాలని చలపతి బలవంతం చేశాడు. అయితే తాను ఇప్పటికే రూ.28 వేలు చెల్లించానని, మిగిలిన రూ.2వేలు, వడ్డీ రూ.1,900 చెల్లించాల్సి ఉందని మారుతి వివరించాడు. ఈ మొత్తం చెల్లించేందుకు తనకు కొంత సమయం ఇవ్వాలని ప్రాధేయపడినా చలపతి వినకుండా రాతితో దాడి చేశాడు. అనంతరం ఆదివారం ఉదయం నార్పలలో ఎరువుల అంగడిలో కూలి పనికి వెలుతున్న మారుతిని అడ్డుకుని బైక్ తాళాలు లాక్కొన్నాడు. తన అప్పు చెల్లించే వరకూ కదలకూడదంటూ నిర్బంధించాడు. ఘటనపై పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మడకశిర రూరల్: మండలంలోని కర్ణాటక సరిహద్దున ఉన్న ఎల్లోటి గ్రామ శివారులో ఆదివారం పేకాట ఆడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. మరో 14 మంది జూదరులు పరారయ్యారు. సీఐ రాజ్‌కుమార్ తెలిపిన మేరకు... ముందస్తు సమాచారంతో ఆదివారం ఉదయం ఎల్లోటి గ్రామ శివారులో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పోలీసుల రాకను గుర్తించిన జూదరులు అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు వెంటాడి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన 14 మంది తప్పించుకున్నారు. నిందితుల నుంచి రూ.1,72,500 నగదు, మూడు సెల్‌ఫోన్లు, ఓ ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన భార్గవ్, నరసింహప్పపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మిగిలిన 14 మందిని త్వరలో అరెస్ట్ చేయనున్నట్లు పేర్కొన్నారు.

బరిలో దిగితే మెడల్ ఖాయం

● బాస్కెట్‌బాల్‌లో రాణిస్తున్న ధర్మవరం క్రీడాకారులు



క్రీడాకారులతో ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్‌లు

ధర్మవరం అర్బన్: బాస్కెట్‌బాల్... ఒక్కో జట్టులో ఐదుగురు చొప్పున రెండు జట్లు ఆడే బాస్కెట్‌బాల్ అంటే ప్రస్తుతమున్న క్రేజ్ అంతాఇంత కాదు. బాస్కెట్‌లో బాల్ వేసేందుకు నువ్వా... నేనా అనేంతగా క్రీడాకారులు సాగించే ఉత్కంఠ పోరును చూస్తే ఎంతటి వారికైనా ఆసక్తి కలగకమానదు. ఇంతటి ఖ్యాతిగాంచిన బాస్కెట్‌బాల్ క్రీడలో ధర్మవరానికి చెందిన పలువురు క్రీడాకారులు రాణిస్తున్నారు. ఈ క్రమంలోనే క్రీడాకారుల్లో నైపుణ్యాలను వెలికి తీసేందుకు కొన్నేళ్లుగా ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు విశేష కృషి చేస్తున్నారు. ప్రత్యేక శిక్షణ అందిపుచ్చుకున్న వందలాది మంది ధర్మవరం క్రీడాకారులు బరిలో దిగితే పతకం గ్యారంటీ అనే స్థాయికి ఎదిగారు. ఎందరో క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించి పతకాలతో మెరిశారు.

క్రీడాభివృద్ధికి కేతిరెడ్డి చొరవ

బాస్కెట్‌బాల్ కోర్టును అభివృద్ధి చేయడంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇందు కోసం రూ.16 లక్షల నిధులను వెచ్చించారు. బాస్కెట్‌బాల్ కోర్టు చుట్టూ ఫెన్సింగ్, ప్రేక్షకుల గ్యాలరీ, క్రీడాకారుల గది నిర్మాణం, కోర్టుకు రంగులు, ఫైబర్ బోర్డులు తదితర పనులకు రూ.6.90 లక్షలను ఆత్మీయ ట్రస్ట్ అందించింది. ప్రస్తుతం అధునాతన బాస్కెట్‌బాల్ కోర్టు అందుబాటులోకి రావడంతో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ధర్మవరం వేదికగా మారింది. అంతేకాక క్రీడాకారులకు శిక్షణ ఇచ్చే కోచ్‌లకు ప్రతి నెలా వేతనాన్ని ఆత్మీయ ట్రస్ట్ అందిస్తోంది.

స్పెయిన్ కోచ్‌లతో ప్రత్యేక శిక్షణ

ఆర్డీటీ సహకారంతో ఏటా నెల రోజుల పాటు స్పెయిన్ దేశానికి చెందిన అంతర్జాతీయ బాస్కెట్‌బాల్ క్రీడాకారులు, కోచ్‌లు ధర్మవరానికి వచ్చి బాస్కెట్‌బాల్ క్రీడాకారులకు మెలకువలు నేర్పుతున్నారు. ఈ ఏడాది జూలైలో స్పెయిన్‌లోని ఈగల్ బాస్కెట్ బాల్ క్లబ్‌కు చెందిన కోచ్‌లు మార్, ఒరియోల్, నటాలియా, పోల్ తదితరులు ధర్మవరంలో బాస్కెట్‌బాల్ క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడమే కాక రూ.లక్షలు విలువ చేసే క్రీడా సామగ్రి, దుస్తులు, బూట్లు అందజేశారు.

బాల్ వేస్తే బాస్కెట్‌లో పడాల్సిందే



ధర్మవరం పట్టణానికి చెందిన కిరణ్మయి బాస్కెట్‌బాల్ క్రీడలో విశేషంగా రాణిస్తోంది. పలు టోర్నీల్లో పాల్గొన్న ఆమె జిల్లా, రాష్ట్ర స్థాయి జట్లలో చోటు దక్కించుకుని తన ప్రతిభను చాటుకుంటోంది. ఆమె చేతికి బాల్ చిక్కితే బాస్కెట్‌లో పడి తీరుతుందని అందరూ అంటున్నారు. చత్తీస్‌ఘడ్‌లోని రాజనందగన్‌లో 2023, మే 31 నుంచి జూన్ 6వ తేదీ వరకు జరిగిన ఇండియన్ ప్రాబబుల్స్ జట్టులోనూ ఆమె కీలకంగా వ్యవహరించింది.

అపజయం ఎరుగని విజయ్



ధర్మవరానికి చెందిన విజయ్ తరుణ్ 2024 ఏప్రిల్ 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు పాండిచ్చేరిలో జరిగిన 38వ యూత్ నేషనల్ బాస్కెట్ బాల్ టోర్నీలో ఏపీ జట్టు తరఫున ప్రాతినిథ్యం వహించాడు. ఇప్పటి వరకూ విజయ్ ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ ఓటమిని ఎరుగలేదు.

నిఖ్య ప్రతిభ అమోఘం



ధర్మవరానికి చెందిన నిఖ్య... జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణిస్తోంది. 2023, ఆగస్టు 3 నుంచి 9వ తేదీ వరకు పుదుచ్చేరిలో జరిగిన సబ్ జూనియర్ జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో ఏపీ జట్టు తరఫున ప్రాతినిథ్యం వహించింది.

నైపుణ్యాలను వెలికి తీయడమే లక్ష్యం

నిరుపేద క్రీడాకారులను గుర్తించి, వారిలో నైపుణ్యాలను వెలికి తీసేందుకు అసోసియేషన్ కృషి చేస్తోంది. బాస్కెట్‌బాల్ క్రీడలో రాణించిన చాలా మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు కోచ్‌లను ఏర్పాటు చేశాం.

– ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.జయచంద్రారెడ్డి, ఎం.రామిరెడ్డి, వి.హిదయ్‌తుల్లా

హెచ్‌ఎంపై టీడీపీ నేత బూతు పురాణం



మేకలపల్లిలో పాఠశాల

సోమందేపల్లి: పేరెంట్స్ కమిటీ ఎన్నికల్లో తాను సూచించిన వ్యక్తికి అధ్యక్ష స్థానం కట్టబెట్టకపోవడంతో ఆ పాఠశాల హెచ్‌ఎంపై రౌడీషీటర్, టీడీపీ మండల కన్వీనర్ సిద్దలింగప్ప బూతులతో విరుచుకుపడ్డాడు. ఫోన్ చేసి మరీ వార్నింగ్ ఇచ్చాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ అంశానికి సంబంధించి వివరాలు... సోమందేపల్లి మండలం బ్రహ్మసముద్రం పంచాయతీ మేకలపల్లి గ్రామ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఈ నెల 8న పేరెంట్స్ కమిటీ అధ్యక్ష స్థానానికి టీడీపీలోని రెండు వర్గాల మధ్య పోటీ నెలకొంది. ఈ క్రమంలో టీడీపీ మండల కన్వీనర్ సిద్దలింగప్ప జోక్యం చేసుకుని పక్క గ్రామానికి చెందిన బ్రహ్మసముద్రంలోని తన అనుచరుడి పేరును ప్రతిపాదించాడు. తన మాటే చెల్లుబాటు కావాలంటూ ఆ సమయంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం గోవిందనాయక్‌ను ఒత్తిడి చేశాడు. ఎన్నికకు సంబంధించి కోరం లేకపోవడంతో పాటు మరో వర్గం బహిష్కరించి వెళ్లిపోయింది. దీంతో ఎన్నిక వాయిదా పడడంతో గోవిందనాయక్‌కు సిద్దలింగప్ప ఫోన్ చేసి బూతులతో విరుచుకుపడ్డాడు. అంతేకాక విద్యార్థుల తల్లిదండ్రులపై అసభ్య పదజాలం ప్రయోగిస్తూ మాట్లాడాడు. ఈ విషయం తెలియడంతో గ్రామస్తులు మండిపడుతున్నారు. గతంలోనూ సిద్దలింగప్ప తీరు వివాదాస్పదంగానే ఉంటూ వచ్చిందని, అధికారులు, ఉపాధ్యాయులపై బెదింపులు, దౌర్జన్యాలకు దిగిన ఘటనలూ ఉన్నాయని ఈ సందర్భంగా గ్రామస్తులు గుర్తు చేశారు. ఇప్పుడు అధికారంలో ఉన్నామనే అహంకారంతో తన ఉనికిని చాటుకునేందుకు గిరిజన వర్గానికి చెందిన ఉపాధ్యాయుడిపై రౌడీయిజం ప్రదర్శించడం సిగ్గుచేటన్నారు. బహిర్గతమైన ఆడియో ఆధారంగా రౌడీషీటర్ సిద్దలింగప్పపై చర్యలు తీసుకోవాలని ఆ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు.

117 జీఓ రద్దుకు ఉద్యమిస్తాం

● ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యారంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్న జీఓ 117 రద్దుకు ఉద్యమిస్తామని ఏపీటీఎఫ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జీఓ 117 రద్దు చేయకపోతే భవిష్యత్తులో వందలాది ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. టీచర్ల సర్దుబాటుకు ముందు బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలన్నారు. కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్‌ను అమలు చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలో ఎస్‌సీఈఆర్టీ సిలబస్‌ను తక్షణమే తొలిగించి సీఈఆర్టీ మాత్రమే అమలు చేయాలన్నారు. సమాంతర బోధనా మాధ్యమాల్లోనే కొనసాగించడంతో పాటు ఈ సంవత్సరం 10వ తరగతి విద్యార్థులకు తెలుగు మాధ్యంలోనే పరీక్ష రాసే అవకాశం ఇవ్వాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు సీపీఎస్‌ను రద్దు చేస్తూ ఓపీఎస్ అమలు చేసేలా ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. సమావేశంలో నాయకులు బి.నరసింహులు, రాయల్ వెంకటేష్, సిరాజుద్దీన్, డి. ప్రభాకర్, బి. వెంకటేశ్వర్లు, బి. బొమ్మయ్య, సతీష్ కుమార్ పాల్గొన్నారు.

కళింగర పండు తిని ఒకరి మృతి

పావగడ: తాలూకాలోని కొడమడుగు గ్రామంలో కళింగర పండు తిని ఒకరు మృతి చెందారు. మరో ఇద్దరు ఆస్పత్రి పాలయ్యారు. వివరాలు... కొడమడుగు గ్రామ పరిసర తోటల్లో కళింగర పంటను సాగు చేశారు. అయితే పంట చేతికి అందుతున్న సమయంలో వైరస్ సోకడంతో పురుగు మందు పిచికారీ చేయలేక నిస్సహాయ స్థితిలో రైతు వాటిని పొలంలోనే వదిలేశాడు. దీంతో గ్రామంలో పలువురు తోటలోకి వెళ్లి వండ్లను తీసుకువచ్చి అధిక మోతాదులో తిన్నారు. వీరిలో ముగ్గురు వ్యక్తులకు వాంతులు, విరేచనాలు కావడంతో వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. జగన్నాథరెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మరో ఇద్దరు బాధితులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారు.

రెండు కార్లు ఢీ - ఒకరి మృతి



మృతుడు మధుసూదన్



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన జైలో వాహనం


చిలమత్తూరు: మండలంలోని దేమకేతేపల్లి వద్ద '544 ఈ' జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం రెండు కార్లు పరస్పరం ఢీకొన్నాయి. ఇన్నోవా వాహనంలో ప్రయాణిస్తున్న కర్ణాటకలోని కోలారు జిల్లా శ్రీనివాసపురం ప్రభుత్వాస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ టెక్నిషియన్ మధుసూదన్ (26) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. జైలో వాహనంలో ప్రయాణిస్తున్న వ్యక్తి కారులోనే ఇరుక్కుపోయాడు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు జేసీబీ సాయంతో క్షతగాత్రుడిని వెలికి తీసి హిందూపురంలోని జిల్లాస్పత్రికి తరలించారు. అతి వేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. రెండు వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నీటి పంపింగ్ ప్రారంభం

వజ్రకరూరు: హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ పథకంలో భాగంగా వజ్రకరూరు మండలం రాగులపాడు వద్ద కృష్ణా జలాల ఎత్తిపోతల ప్రక్రియ పునః ప్రారంభమైంది. ఈ నెల 1వ తేదీన నంద్యాల జిల్లా మల్యాల వద్ద నీటి పంపింగ్ ప్రారంభించగా 6వ తేదీ రాత్రి 9 గంటలకు రాగులపాడు లిఫ్ట్‌కు చేరుకున్నాయి. అదే రోజు రాత్రి 10 గంటలకు రెండు పంపుల ద్వారా నీటిని ఎత్తిపోశారు. ఈ క్రమంలో 57వ కిలోమీటర్ వద్ద కాలువ నిర్వహణ పనుల్లో భాగంగా ఈ 9న ఒక రోజు పంపింగ్‌ను ఆపేశారు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటల నుంచి మూడు పంపులతో నీటి పంపింగ్ ప్రారంభించారు. దాదాపు 908 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తున్నట్లు హంద్రీనీవా ఏఈ తెలిపారు.



సర్పాల సయ్యాట



పెనుకొండ రూరల్: మండలంలోని అమ్మవారిపల్లిలో కియా పోలీస్ స్టేషన్ ఎదురుగా ముళ్ల కంచె వద్ద ఆదివారం ఉదయం సర్పాలు సయ్యాటలాడాయి. దాదాపు 10 అడుగుల పొడువున్న రెండు పాములను చూడగానే స్థానికులు భయాందోళనకు గురయ్యారు. దాదాపు అరగంట పాటు పాములు అక్కడే సయ్యాటలాడుతున్న దృశ్యాలను చూసిన పలువురు తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు.

నేడు డీపీఓలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. ఈ మేరకు డీపీఓ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఎస్పీ వి.రత్న స్వయంగా హాజరై వినతులు స్వీకరించనున్నారు.

జిల్లా పంచాయతీ కార్యదర్శుల నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న కోశాధికారి జయపాల్‌రెడ్డి

పుట్టపర్తి: జిల్లా పంచాయతీ కార్యదర్శుల నూతన అడ్‌హాక్ కమిటీ ఎన్నిక ఆదివారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా రామమోహన్, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వర్, ట్రెజరర్‌గా జయపాల్ రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా పి.గోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా గోపి, గణేష్‌రెడ్డి, మహిళా విభాగం సెక్రటరీగా త్రివేణి తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ట్రెజరర్ జయపాల్‌రెడ్డి మాట్లాడుతూ... పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ కృషి చేస్తోందన్నారు. డిమాండ్ల సాధనకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకెళుతామని భరోసానిచ్చారు.

కారు అపహరణ కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గోరంట్ల: మండలంలోని మిషన్ తండా సమీపంలోని కొరియన్ హోటల్ వద్ద గురువారం రాత్రి కొరియన్‌కు చెందిన కియా కారును దుండగులు అపహరించుకెళ్లారు. ఘటనకు సంబంధించి అదే రోజు హోటల్ మేనేజర్ శ్రీకాంత్‌నాయక్‌తో కలసి పోలీసులకు బాధిత కొరియన్ ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు డీఎస్పీ ఎ.శ్రీనివాసులు నేతృత్వంలో దర్యాప్తు వేగవంతం చేశారు. పక్కా ఆధారాలతో రామన్నపల్లికి చెందిన వడ్డే రమేష్‌ను ఆదివారం చిలమత్తూరు మండలం శెట్టిపల్లి వద్ద అరెస్ట్ చేసి, రూ.1.470 లక్షల విలువైన కియా కారుతో పాటు కొరియన్ హోటల్‌లో చోరీ చేసిన ఎల్ఈడీ టీవీ, ఇన్వర్టర్, బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. కాగా, నిందితుడు గతంలో కొరియన్ వద్ద డ్రైవర్‌గా పనిచేస్తూ మానేసినట్లు విచారణలో నిర్ధారణ అయింది. నిందితుడి అరెస్ట్‌లో చొరవ చూపిన సిబ్బందిని ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు.

విజ్ఞాన వారధులు



సందర్భం: నేడు లైబ్రేరియన్స్ దినోత్సవం

అనంతపురం/కల్చరల్: మనో వికాసానికి ఇతోధికంగా దోహదపడే సాధనాల్లో గ్రంథాలయాలు కీలకం. ఈ క్రమంలో విజ్ఞానానికి, పాఠకులకు మధ్య వారధిగా నిలిచే గ్రంథాలయ పాలకులకంటూ చరిత్రలో ఓ రోజును కేటాయించారు. లైబ్రేరియన్స్ ప్రాధాన్యతను తెలుపుతూ ప్రతి ఆగస్టు 12న 'లైబ్రేరియన్స్ డే'గా జరుపుకుంటాం. జిల్లా వ్యాప్తంగా 79 గ్రంథాలయాలు ఉన్నాయి. ఇందులో 9 గ్రామీణ గ్రంథాలయాలు ఉండగా.. మొత్తం రెగ్యులర్ లైబ్రేరియన్స్ 37 మంది, ఔట్‌సోర్సింగ్ లైబ్రేరియన్స్ ముగ్గురు, ఔట్‌సోర్సింగ్ స్టాఫ్ 21 మంది గ్రంథాలయాలను సమర్థవంతంగా నడుపుతున్నారు. జిల్లాలో 80 పుస్తక నిక్షిప్త కేంద్రాలు (బీడీసీలు) ఉన్నాయి. సగటున రోజుకు వేలమంది పాఠకులు, విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకుంటున్నారు.

లైబ్రేరియన్ల ప్రధాన సమస్యలివే..

- రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించాలి.
- ప్రమోషన్లలో గ్రేడ్-3 గ్రంథాలయ అధికారులకు గ్రేడ్-2 పదోన్నతి కల్పించాలి.
- గ్రంథాలయాల ఆధునీకీకరణ జరగాలి. చాలా చోట్ల గ్రంథాలయ అధికారి లేకున్నా కింది స్థాయి ఉద్యోగులతో లైబ్రరీలు నడుస్తున్నాయి. అలా కాకుండా అర్హత కలిగిన లైబ్రేరియన్లను తీసుకోవాలి.
- రోజురోజుకు మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేసి కంప్యూటర్‌పై ఎప్పటికప్పుడు తరగతులు నిర్వహించాలి.
- పదోన్నతుల్లో గ్రేడ్-2 నుంచి మాత్రమే గ్రేడ్-1 ప్రమోషన్ కల్పించాలి. ఇప్పటి వరకు ఉన్న 1:1 కాకుండా 1:3 రేషియోలో పదోన్నతులు కల్పించాలని లైబ్రేరియన్లు డిమాండ్ చేస్తున్నారు.

పాఠకులతో ప్రత్యేక అనుబంధం



ఉద్యోగంలో చేరినప్పటి నుంచి పాఠకులతో ప్రత్యేక అనుబంధాన్ని ఏర్పరుచుకున్నాను. జిల్లా కేంద్రంలో డిజిటల్ లైబ్రరీ కోసం ఆర్డీటీ వారిని ఒప్పించడంలో నేనూ భాగస్వామిని కావడం సంతోషంగా ఉంది. ముఖ్యంగా దాతలను ఒప్పించి ఎంతో మంది విద్యార్థులకు లైబ్రరీలో సభ్యత్వం ఇప్పించాం. 010 పద్దు కింద జీతాలు చెల్లించాలని పోరాటం సాగిస్తూనే ఉన్నాం. ఈ విషయంపై ప్రభుత్వం స్పందించాలి.

– జయరాం, లైబ్రేరియన్, కొత్తచెరువు

సద్వినియోగం చేసుకోండి



2019లో పబ్లిక్ లైబ్రేరియన్‌గా పని చేశా. తర్వాత 2021లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా జూనియర్ కాలేజ్ లైబ్రేరియన్‌గా చేరాను. నిరుద్యోగ యువత లైబ్రరీలను సద్వినియోగం చేసుకోవాలి. అర్హత కలిగిన లైబ్రేరియన్లకు ప్రిన్సిపాళ్లుగా ప్రమోషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– విజయకుమారి, లైబ్రేరియన్, జూనియర్ కాలేజీ, కదిరి